

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) సా.6.25
సహరీ (మంగళ) ఉ.4.36

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	27

వైసీపీని.. తరిమికొడదాం..





పాదగయ క్షేత్రంలో పూజ చేసి వెళుతున్న పవన్‌కల్యాణ్

పిఠాపురాన జనసేనాని పిలుపు

- 40 రోజులు దీక్షగా చేయాల్సిందే
- గెలుపే లక్ష్యంగా పనిచేయండి
- వైసీపీ కుతంత్రాలను తిప్పికొట్టండి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వెల్లువెత్తిన పవన్ అభిమానులు
- స్వల్ప అస్వస్థతతో హైదరాబాద్‌కు
- నేటి ఉదయం గొల్లప్రోలుకు రాక

పిఠాపురం,మార్చి 31 : వైసీపీ పాలన తరిమికొట్టడమే లక్ష్యంగా మండల దీక్ష మాదిరి 40 రోజులు కష్టించి నిష్ఠగా గెలుపుకోసం పనిచేద్దామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అనేక కుతంత్రాలకు పాల్పడుతుందని, వాటన్నింటిని సమిష్టిగా తిప్పికొడదామన్నారు. పిఠాపురంలో తన గెలుపు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలన్నారు. పిఠాపురంలో తన గెలుపు బాధ్యత తీసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు కృతజ్ఞతలు తెలిపారు. తాను గెలిచిన అనంతరం వర్మ గౌరవానికి, మర్యాదకు భంగం కలగకుండా చూసుకుంటాన ని చెప్పారు. వర్మ నాయకత్వ పటిమ, సమర్థత, ప్రతిభ తాను పూర్తిగా అర్థం చేసుకున్నానని తెలిపారు. చంద్రబాబు గీసిన గీత దాటను అని వర్మ చెప్పడం తనకు ఆనందం కలిగించిందని చెప్పారు. వర్మకు భవిష్యత్తులో మంచి స్థానం కల్పించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వర్మ గురించి మాట్లాడుతున్నంత సేపు ఆయన చేతిని పవన్‌కల్యాణ్ పట్టుకునే ఉన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో నాయకులను సమన్వ యం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపా రు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేయాలనే అంశంపై మూడు పార్టీల నాయకులతో ఎప్పటికప్పుడు చర్చించి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీని వాస్‌పై పవనకల్యాణ్ ప్రశంసలు కురిపించారు. ఉదయ శ్రీని వాస్ కష్టించి ఎదిగిన యువకుడు అన్నా రు. 2017లో రూ.10 లక్షలతో టీటైం స్థాపించిన ఆయన ప్రస్థానం ఇప్పుడు దేశం దాటి నేపాల్ వరకూ విస్తరించిందని తెలిపారు. యువత తెలివితేటలకు ఉదయ శ్రీనివాస్ ప్రత్యక్ష తార్కాణమని చెప్పారు. ఈయన ఇక్కడ సం పద సృష్టించి చూపుతాడని తెలిపారు. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న సునీల్ మంచి వ్యక్తే అయినా తప్పుడు పార్టీలను ఎంచుకుంటారని చెప్పారు. ఆయన ఇక్కడ సంపదను పట్టుకుపోతాడని వ్యాఖ్యానించారు. నాయకుల మధ్య చిన్న చిన్న విభేదాలు, భేదాభిప్రాయాలు ఉన్నా రాష్ట్ర భవిష్యత్తు, ప్రజాసంక్షేమం అనే రెండు అజెండాలుగా సమిష్టిగా ఎన్నికలను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.పిఠాపురం సమన్వయకర్తగా అనపర్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని నియమించారు. సమావేశంలో పవన్‌ను టీడీపీ, బీజేపీ నాయకులు సత్కరించారు. సమావేశంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, గిరీష్‌వర్మ,బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు,కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మీ వెంటే : బిల్డింగ్ పైనుంచి పవన్‌ను చూస్తున్న మహిళలు.. కూటమి సమావేశంలో మాట్లాడుతున్న పవన్

రెండో రోజు అదే అభిమానం..

రెండో రోజు.. అదే జోరు.. ఎటు చూసినా జనమే.. జనం.. పవనాభిమానులు వెల్లువెత్తారు. దారి పొడవునా ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు.. మహిళలు హారతులు పట్టారు. తమ అభిమాన నాయకుడు పవన్‌ను చూసేందుకు మహి ళలు డాబాలు ఎక్కడంతో పాటు పూల వర్షం కురిపించారు. వారందరికి పవన్ అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.జనాభిమానానికి పులకించిన పవన్ కారు ఓపెన్ టాప్ నుంచి వారికి నమస్కరించి చేతులు జోడించి అభివాదం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తొలిరోజు రోజు పర్యటన అనంతరం పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం 10.50 గంటల సమయంలో అక్కడ నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రం చేరుకుని పురుహూతికాశక్తి పీఠాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. పాదగయ జంక్షన్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభించారు.హైదరాబాద్ తిరిగి వెళ్లేం దు కు మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న పవన్‌కల్యాణ్‌కు జనసేన,టీడీపీ నాయకులు,అభిమానులు ఆదివారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు.

హైదరాబాద్‌కు పయనం

నాలుగు రోజులు పాటు పిఠాపురంలోనే ఉంటానని పవన్‌కల్యాణ్ ముందుగానే ప్రకటించారు. అయితే పవన్ జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్నారు. దీంతో కొత్తపల్లి మండలంలోని బషీర్‌బీబీ దర్గా సందర్శనను రద్దు చేసుకుని పిఠాపురంలో ఆలయాల సందర్శనకే పరిమితమయ్యారు. కూటమి పార్టీల కార్యకర్తల సమావేశం అనంతరం గోకులం గ్రాండ్ నుంచి నేరుగా గొల్లప్రోలులోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్ పయనమయ్యారు. పవన్ హెలికాప్టర్ టేకాఫ్‌కు సాయంత్రం 5.30 గంటల వరకూ మాత్రమే ఏటీసీ నుంచి అనుమతి ఉంది. దీంతో ఆయన కార్యకర్తల సమావేశాన్ని ముగించుకుని వచ్చారు. సాయంత్రం 5.08 గంటలకు హెలికాప్టర్ టేకాఫ్ కావడంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అస్వస్థతగా ఉన్న పవన్ చికిత్స చేయించుకునేందుకే హైదరాబాదు వెళ్లారని ఆ పార్టీ నేతలు తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు గొల్లప్రోలుకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడే

వజ్రాయుధమే ఓటు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడే వజ్రాయుధమే ఓటు అని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు అంటే ఏదో రాజకీయ పార్టీలకు సంబంధించినదనే భావన నుంచి బయటపడాలన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు విద్యా సంస్థలతో పాటు పలు ప్రాంతాల్లో 'స్వీప్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో 85శాతానికి ఓటింగ్ పెంచాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. ప్రలోభాలు లేని నైతిక ఓటింగ్ ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో అందరూ ఓటు వేసి ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్‌పై ఆసక్తి తగ్గడం వల్ల ఓటింగ్ శాతం తగ్గుతున్న దృష్ట్యా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేశామని, అవసరమైన చోట్ల వీల్‌చైర్లను అందుబాటులో ఉంచామన్నారు. విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులకు ఫ్రెండ్లీ ఓటింగ్‌లో భాగంగా ఓటరు హెల్ప్‌లైన్ డెస్క్, బ్రెయిలీ బ్యాలెట్ షీట్,ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు సహాయకులను అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా దివ్యాంగులు తమ ఓటు హక్కును పరిపూర్ణంగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.



మిచౌంగ్ తుఫాను సమయంలో పెనికేరులో నీట మునిగిన వరి పంట

సార్వా పరిహారమేదీ!

ఇప్పటికీ అందలేదని రైతు శ్రీనివాస్ ఆవేదన



అలమూరు, మార్చి 31: సార్వాలో సంభవించిన తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు నెలలో పరిహారం ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వలేదని మండలంలోని పెనికేరుకు చెందిన రైతు గన్ని శ్రీనివాస్ ఆవేదన చెందాడు. గత ఏడాది డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుఫా నుకు ఆయన 10 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట పూర్తిగా నీట మునిగింది. కోయడానికి కూడా పనికిరాకుండా పోయింది. నష్టపరిహారం అందిస్తామని అప్పట్లో అధికారులు, నాయకులు చెప్పారు. నెలలో ఇస్తామన్నా నేటికీ అతీగతీ లేదు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఈ గ్రామంలో శ్రీనివాస్‌తో పాటు పలువురు రైతులకు కూడా నష్టపరిహారం అందాల్సి వుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు. వేదికపై రామచంద్రపురం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి సుభాష్, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి

టీడీపీ హయాంలోనే బీసీల అభివృద్ధి

- శెట్టిబలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మార్చి 31: మండపేట నియోజకవర్గంలో మూడు దఫాలుగా తన విజయానికి శెట్టిబలిజల సహకారమేనని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరపున పోటీ చేస్తున్న తనతో పాటు రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. మండపేట నియోజకవర్గంలోని శెట్టిబలిజ సంఘీయులతో మండపేట-ఏడిద రోడ్డులోని విజయ ఫంక్షన్ హాలులో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని మండపేట నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గుడాల జయబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి-సత్తిబాబు, రాష్ట్ర శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు కుడిపూడి సత్తిబాబు, దాసరి సత్యనారాయణ, కాదా ప్రభాకరరావు హాజరయ్యారు. వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే బీసీల అభివృద్ధి జరిగిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. కుర్చీలు, నిధులు లేని కార్పొరేషన్లు పెట్టిన సీఎం జగన్ బీసీలను నిలువునా మోసం చేశాడని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీల అభ్యున్నతికి టీడీపీ పెద్దపీట వేస్తుందన్నారు. ఎన్నికల వేళ కుల సంఘాల పెద్దలు బీసీలను వెలివేయడం, కట్టడి చేయడం, శిక్షలు వేయడం చేస్తే సహించేది లేదని సుభాష్ హెచ్చరించారు. రాబోయేది కూటమి ప్రభుత్వమేనన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 30 ఏళ్లుగా ప్రత్యర్థులుగా వున్న పిల్లి సుభాష్‌చంద్రబోస్, తోట త్రిమూర్తులు కలిసిపోయారని, వారి నైతికతను ప్రజలు గమనించాలని సూచించారు. బీసీలంతా టీడీపీకి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీసత్తిబాబు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు సముచిత స్థానం దక్కిందన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయా నికి బీసీలంతా సహకరించాలని కోరారు. రాష్ట్ర శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కుడిపూడి సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బలహీన వర్గాలకు చేసిందేమీ లేదన్నారు. పలువురు బీసీ నేతలు వైసీపీ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు.

సమావేశంలో మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వి.సాయికుమార్‌బాబు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, తెలుగు మహిళ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కాదా ప్రభాకరరావు, చింతపల్లి రామకృష్ణ, కుక్కల రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సూరంపూడి గనిరాజు, బండి గోవిందు, చీకట్ల గోవిందరాజు, కొప్పిశెట్టి వాసు, కె.మాధవరావు, గుత్తుల గోవిందరావు, గుత్తుల సత్తిబాబు, జి.మాధవి, వాసంశెట్టి రాజేశ్వరిశ్రీనివాస్, కాదా కేదారేశ్వరుడు, అధిక సంఖ్యలో శెట్టిబలిజలు పాల్గొన్నారు.

'బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం టీడీపీతోనే సాధ్యం'

అమలాపురం టౌన్, మార్చి 31: బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన పథకాలన్నింటినీ అమలు చేయగల సత్తా చంద్రబాబుకు ఉందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం టీడీపీతోనే సాధ్యమన్నారు. బీసీల అభివృద్ధిని అడ్డుకున్న జగన్‌కు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. అమలాపురంలో మెట్ల రమణబాబు అధ్యక్షతన జయహో బీసీ డిక్లరేషన్ సభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి అభ్యర్థి ఆనందరావు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థులు ఎక్కడ పోటీచేసినా బీసీలంతా అండగా నిలిచి విజయం అందించాలన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌దేనన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు గుత్తుల నాగేశ్వరరావు, భాస్కర్ల రామకృష్ణ, తాళాబత్తుల చినబాబు, వెలిగట్ల రామలక్ష్మణరావు, వాసంశెట్టి జగదీష్, పట్నాల రమణ, ఆవుపాటి గోపాల్, పేరూరి విజయలక్ష్మి, పలివెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

అంతన్నారు... ఇంతన్నారు...

మధ్యలో వదిలేశారు

మామిడికుదురు మండలంలో అసంపూర్తిగా ప్రభుత్వ భవనాల నిర్మాణం

మామిడికుదురు, మార్చి 31: 'మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సంక్షేమానికి రైతు భరోసా కేంద్రాలు నిర్మిస్తాం... ప్రజల ఆరోగ్యం కోసం వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం...' అంటూ వైసీపీ నేతలు బీరాలు పలికారు. అయితే కొన్నిటిని నిర్మించి, మరికొన్నిటిని మధ్యలోనే వదిలేశారు. మామిడికుదురు మండలంలో పదహారు సచివాలయాలు, పది వెల్‌నెస్ సెంటర్లు, పది రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు. సచివాలయాలు పన్నెండు పూర్తి కాగా నాలుగు వివిధ దశల్లో వున్నాయి. వెల్‌నెస్ సెంటర్లు నాలుగు పూర్తవ్వగా ఆరు వివిధ దశల్లో వు న్నాయి. రైతు భరోసా కేంద్రాలు ఆరు పూర్తికాగా నాలుగింటి పనులు మధ్యలోనే పనులు ఆగిపోయాయి. ఆదుర్రులో రైతు భరోసా కేంద్రం పునాదుల్లోనే నిలిచిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేసి తలుపులు పెట్టకుండాను, మరికొన్ని గ్రామాల్లో ప్లాస్టింగ్ చేయకుండా భవనాలను వదిలేశారు. మామిడికుదురులో శ్మశానవాటిక పక్కన వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం నిర్మించడానికి ఏర్పాట్లు చేశారు. అప్పట్లో శ్మశానవాటిక పక్కన ప్రభుత్వ భవనాల నిర్మాణం ఏమిటని స్థానికులు వ్యతిరేకించినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పనులను ప్రారంభింపజేశారు. కాంట్రాక్టరుకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో వారు చేతులెత్తేశారు. వైసీపీ పాలన పూర్తి కావస్తున్నా నిర్మాణాలకు అతీగతీ లేదని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ప్రచార ఆర్భాటం తప్ప పనులు జరగట్లేదని వ్యాఖ్యానిస్తున్నారు. కాగా ముందుగా పెట్టుబడి పెట్టి నిర్మాణ పనులు చేపట్టిన పలువురు కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు అందక లబోదిబోమంటున్నారు.



ఆదుర్రులో పునాదుల్లో నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రం



మామిడికుదురులో శ్మశానం పక్కన అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు



పెదపట్నంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రం



పాశర్లపూడిలంకలో మధ్యలోనే ఆగిపోయిన వెల్‌నెస్ సెంటర్ నిర్మాణ పనులు



మామిడికుదురులో అసంపూర్తిగా వదిలేసిన వెల్‌నెస్ సెంటర్ వద్ద మొలిచిన పిచ్చిమొక్కలు

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

...వివరాలు 5లో



బురద జల్లే కుట్ర

- వలంటీర్లను తొలగించింది ఎన్నికల సంఘం
- కానీ టీడీపీపై ఆ నెపం నెట్టే ప్రయత్నం
- నేడు పింఛన్ పంపిణీ లేనట్టే..
- లబ్ధిదారులను ఇబ్బంది పెట్టే కుట్ర
- 3 నుంచి 8 వరకు పంపిణీకి చర్యలు
- సచివాలయాలకు వెళ్లి తీసుకోవాలట?
- ఆధార్ కార్డు తెస్తేనే పింఛన్

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి) పింఛనుదారులు ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతున్నట్టు అనుమానాలు వస్తున్నాయి. ప్రతి నెలా 1వ తేదీన వారికి పింఛన్లు అందజేస్తున్న సంగతి తెలిసిందే. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి తీసుకుని వెళ్లి సొమ్ములు అందించేవారు. నడవలేని వారు, డయాలసిస్, పెరాలసిస్, హెచ్ఐవీ బాధితులకు కూడా ఇంటికి తీసుకుని వెళ్లి ఇచ్చేవారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల విధులను అధికార వైసీపీ దుర్వినియోగం చేస్తుండడంతో, ఎలక్షన్ కమిషన్ వారిని విధుల నుంచి దూరం పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో తీవ్ర షాక్‌కు గురైన వైసీపీ నేతలు.. పింఛనుదారులకు సకాలంలో పింఛన్లు వెళ్లకుండా చేసి, ఇబ్బంది పెట్టి, దీనికి కారణం తెలుగుదేశం, దాని మిత్రపక్షాల వైఖరి అని చెప్పడానికి తెగతంటాలు పడుతోంది. అందుకే టీడీపీ అధినేత చంద్రబాబు ముందుగా మేల్కొని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తూ, 1వ తేదీనే లబ్ధిదార్లకు పింఛను అందజేసే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవచ్చు. అందుకు సచివాలయ సిబ్బంది కావలసినంత మంది ఉన్నారు. వారితో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయిస్తే ఒక రోజులోనే పంపిణీ చేయవచ్చు. కానీ వలంటీర్లను ఎన్నికల కమిషన్ ఆపేయడంతో, పెన్షన్లు ఆలస్యం చేసి, ఆ నెపాన్ని తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి మీదకు తోసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో 2.45 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారు. ఇందులో 18 రకాల లబ్ధిదారులు ఉన్నారు. వారందరికీ నెలకు రూ.75 కోట్లు పంపిణీ చేయవలసి ఉంది. వృద్ధులు, చేనేత, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, కిడ్నీ బాధితులు, హెచ్ఐవీ బాధితులు, చర్మకారులు ఉన్నారు. ఇంకా అమరావతికి భూములు ఇచ్చిన రైతుల పింఛను కూడా ఉంది. అమరావతికి భూములిచ్చిన వారిలో ధవళేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురు ఉండడం గమనార్హం. వారు పేదలు కావడంతో నెలకు పింఛను వస్తోంది. ఇక హిజ్రాలకూ పింఛన్ ఉంది.

సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఏప్రిల్ నెలలో సామాజిక భద్రత పెన్షన్లు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఆయా సచివాలయాల వద్ద పంపిణీ చేయనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆదివారం సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలోని పింఛనుదారులంతా తమ ప్రాంతాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద సిబ్బంది ద్వారా పెన్షన్లు తీసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, పెన్షన్ పాసు పుస్తకం తీసుకుని వెళ్లాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ సచివాలయాల వద్దే పింఛన్లు తీసుకునేటట్టు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



ఇంటింటికీ ఇవ్వరు..

విధులు దుర్వినియోగం కాకుండా ఎన్నికల విధులకు వలంటీర్లను ఈసీ దూరం పెట్టిన సంగతి తెలిసిందే. శనివారమే ఈసీ ఈ నిర్ణయం ప్రకటించినా, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయింది. దీని వెనుక దురుద్దేశం ఉన్నట్టు విమర్శలు వస్తున్నాయి. పింఛనుదారులు ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు పనివేళల్లో వెళ్లాలని, ఆధార్‌కార్డు వెంట తీసుకుని వెళ్లాలని సమాచారం ఇచ్చింది. ఈ విషయం ఇంకా లబ్ధిదార్లకు పూర్తిగా చేరే అవకాశం లేదు. సోమవారం ఉదయం పింఛన్ల కోసం లక్షల మంది ఎదురు చూస్తుంటారు. కానీ పింఛన్ పంపిణీ మూడో తేదీ నుంచి మొదలు కానుంది. సచివాలయాల్లో ఎంతమంది ఉద్యోగులుంటే అన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ వృద్ధులు సచివాలయాలకు నడిచి రాగలరా, అందరికీ ఓపిక ఉంటుందా? అసలు మంచం మీద నుంచి నడవలేనివారు కూడా ఉంటారు. అంతేకాక కిడ్నీ బాధతో డయాలసిస్ చేసుకునే వారు, పెరాలిసిస్ బాధితులు, హెచ్ఐవీ బాధితులు కూడా ఉన్నారు. వీరంతా సచివాలయాలకు ఎలా వెళ్లగలరు? గతంలో మంచం మీద నుంచి కదలలేని ముసలివారికి కూడా దగ్గరకు వెళ్లి, పింఛన్లు అందజేసినట్టు గొప్పగా ప్రచారం చేసుకున్న నేతలకు ఈసారి ఇబ్బంది పెట్టడం తప్పనిపించడం లేదా? ఒక్కో సచివాలయంలో 8 మంది నుంచి 11 మంది వరకూ ఉద్యోగులు ఉంటారు. వారందరికీ పురమాయించి, ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయమంటే చేయలేరా.. సచివాలయ వ్యవస్థ గురించి గొప్పగా ప్రచారం చేసుకున్న ప్రభుత్వం, వారితో ఇంటింటా సర్వేలు వంటి అనేక పనులు చేయించిన ప్రభుత్వం వారిచేత ఇంటికే పింఛన్లు పంపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు కోరుతున్నారు.

3 నుంచే పంపిణీ

లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ ఇస్తున్నట్టు చెబుతున్న ప్రభుత్వం ఏప్రిల్ 1న అంటే సోమవారం పంపిణీ చేయడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగింపు వంటి కారణాలు చూపుతూ, ఆదివారం బ్యాంక్‌లు పనిచేసినప్పటికీ లబ్ధిదార్లకు డబ్బులు ఇవ్వడానికి ఇప్పటివరకూ బ్యాంక్‌లలో డబ్బులు జమ చేయలేదు. 3నుంచి 8వ తేదీ వరకూ పంపిణీ చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

దుష్ప్రచారం

వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేసి, అంతా జగనే ఇస్తున్నాడని, ఆయనకే ఓటు వేయాలని చెప్పించుకుంటున్న వైసీపీకి ఈసీ నిర్ణయం మింగుడు పడడం లేదు. ఇతర ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసి, జగన్ గురించి చెప్పరేమోననే ఆందోళన మొదలైంది. లబ్ధిదార్లంతా దూరమైపోతారేమోనని భయం పట్టుకుంది. పైగా చంద్రబాబు ఇప్పటికే తన ఎన్నికల మేనిఫెస్టోలో నెలకు రూ.4 వేల పింఛను సొమ్ము ఇస్తామని, ఇంటికే పంపిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి పింఛన్‌దారులు ఆకర్షితులవుతారేమోననే భయం వైసీపీకి పట్టుకుంది. ఏప్రిల్ నెలలోను, పోలింగ్‌కు ముందు మే నెలలోనూ పింఛన్ల ఆలస్యం చేసి, తెలుగుదేశం, దాని మిత్రపక్షాల విధానాల వల్లే పింఛన్లు పంపిణీ ఆలస్యమైందని చెప్పి, లబ్ధి పొందాలనే కుయుక్తులు పన్నుతోంది. వృద్ధులు, వివిధ రకాల ఇబ్బందులు, సమస్యలతో ఉన్న పింఛన్‌దారులను ఇలా ఇబ్బంది పెట్టడం మంచిది కాదనే వాదన మొదలైంది. 1వ తేదీనే పింఛన్ సొమ్ము ఇవ్వాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఇతర ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.

ఫోన్లు ఇంకా వలంటీర్ల వద్దనే..

వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌ఫోన్లను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఈసీ ఆదేశించినా జిల్లాలో ఇంకా అందరి నుంచి ఫోన్లు తీసుకోలేదు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదివారం కొందరి నుంచి ఫోన్లు తీసుకున్నామని, సోమవారం నాటికి పూర్తిగా తీసేసుకుంటామని చెబుతున్నారు. జిల్లాలోని గ్రామాల్లో ఈప్రక్రియ ఇంకా మొదలు కాలేదు.



కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పవన్

దైవారాధనలో..

పిఠాపురంలో పలు ప్రసిద్ధి ఆలయాలను దర్శించిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్



శ్రీపాదశ్రీవల్లభ సంస్థానంలో కొబ్బరికాయల ముడుపు

పిఠాపురం, మార్చి 31: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఆదివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సందర్శించారు. పాదగయలో కొలువై ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవారిని దర్శించుకున్నారు. శక్తి పీఠం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అష్టోత్తర కుంకుమార్చన చేసి అమ్మవారికి పట్టుచీర సమర్పించారు. శ్రీచక్రాన్ని తాకి కుంకుమ పూజలో పాల్గొన్నారు. మొదటగా విఘ్నేశ్వరుని పూజించుకుని, స్వయంభూ శ్రీపాదశ్రీవల్లభ దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహించారు. ఔదంబర వృక్షానికి పూజలు చేశారు. అక్కడ నుంచి స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవిని దర్శించి పూజలు చేశారు. పురుహూతికా శక్తి మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు పలికి అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను బహుకరించారు.

శ్రీపాదశ్రీవల్లభునికి పూజలు

దేశవ్యాప్తంగా శ్రీపాదుని జన్మస్థలిగా ప్రసిద్ధిగాంచిన శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని పవన్ సందర్శించారు. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. పవన్ పేరుపై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఔదంబర వృక్షానికి కొబ్బరికాయ ముడుపు కట్టి మొక్కారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికి ప్రసాదాలు అందజేశారు. ఆలయాలను పవన్‌కల్యాణ్ సంప్రదాయ దుస్తుల్లో దర్శించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ వెంట కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

జనసేన ఎన్నికల పర్యవేక్షణ కమిటీ

పిఠాపురం సమన్వయ బాధ్యతలు మర్రెడ్డికి

పిఠాపురం, మార్చి 31: జనసేన పోటీ చేస్తున్న అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఎన్నికల పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నియమించారు. ఈ కమిటీలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, జాతీయ మీడియా పార్టీ అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, అనపర్తి ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, పార్టీ అధికార ప్రతినిధి కె.శరత్‌కుమార్ సభ్యులుగా ఉంటారు. పిఠాపురం నియోజకవర్గ సమన్వయ బాధ్యతలను మర్రెడ్డి శ్రీనివాస్‌కు అప్పగించారు. జనసేన పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో పార్టీ సమాయత్తం కావడం, సమన్వయం, ప్రచారాలు, పోల్, బూత్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీ సభ్యులతో ఆదివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు.


వేగుళ్లను గెలిపించండి

లీలాకృష్ణతో పవన్



మండపేట, మార్చి 31: కాకినాడ జిల్లా పిఠాపురం పర్యటనలో ఉన్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు మండపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆదివారం పిఠాపురం వెళ్లి పవన్‌తో సమావేశమయ్యారు. కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలని లీలాకృష్ణను పవన్ కోరారు. కూటమి అధికారంలోకి రాగానే సముచిత స్థానం ఉంటుందని లీలాకృష్ణకు పవన్ భరోసా ఇచ్చారు. త్వరలో మండపేటలో ఎన్నికల ప్రచారానికి వస్తానని పవన్ వారికి సూచించారు. ఇద్దరు నేతలు కలిసి గెలుపే లక్ష్యంగా, వైసీపీ ఓటమే ధ్యేయంగా పనిచేయాలని పవన్ కోరారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి విజయం కోసం పనిచేస్తానని లీలాకృష్ణ చెపినట్టు ఎమ్మెల్యే వేగుళ్ల చెప్పారు.

లోవ దేవస్థానం కిటకిట



ఆరుబయట వంటలు చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, మార్చి31: కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా కనిపించింది. అమ్మవారి దర్శనార్థం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా రూ.3.9 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాథరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ మృతి

అన్నవరం, మార్చి 31: అన్నవరం రైల్వేస్టేషన్ పట్టాలపై ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ప్రయాణికులు, స్టేషన్ సిబ్బంది సమాచారంతో రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, హెచ్‌సీ శ్యామ్ మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. కాఫీ కలర్ చుడీదార్ శరీరంపై ఉంది. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

ఊట కాలువలో పడి లారీ డ్రైవర్ దుర్మరణం

అనపర్తి, మార్చి 31 : అనపర్తి నుంచి అర్తమూరు వెళ్లే నల్లకాలువ గట్టున పిరమిడ్ కేంద్రం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారంతో ఆదివారం పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. అనపర్తి మండలం పొలమూరుకు చెందిన మల్లిడి నర్సిరెడ్డి(36)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు చెప్పారు. ఈ మేరకు నర్సిరెడ్డి సోదరుడు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. ద్వారపూడికి చెందిన లారీపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని రెండు రోజుల కిందట డ్రైవింగ్ పనిపై ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడన్నారు. మద్యం మత్తులో ఊట కాలువలో పడి మృతి చెందినట్టు భావిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

సత్యదేవుని ఆలయ పునఃనిర్మాణానికి పుష్కర కాలం

నేడు ప్రత్యేక పూజలు, విశేష పదార్థాల నివేదన, పండిత సత్కారాలు




అన్నవరం, మార్చి 31: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయ పునఃనిర్మాణం పూర్తయి సోమవారానికి 12 సంవత్సరాలు పూర్తైంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేషపదార్థాల నివేదన, పండిత సత్కారాలతో వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. సత్యదేవుడి ఆలయం 1891 ఖర నామ సంవత్సరం శ్రావణ శుద్ధ విదియ రోజున ఆవిర్భవించినట్లు ఆలయ చరిత్రను బట్టి తెలుస్తుంది. పూరిపాకలో మూలవరులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దరిమిలా 1933-34లో ఆలయాన్ని నిర్మించారు. 1970 వ దశకంలో ఆలయంపై పిడుగు పడడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో 2011 ఫిబ్రవరి నెలలో దేవదాయ కమిషనర్ ఆదేశాలతో అప్పటి ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తమిళనాడు నమ్మక్కల్ నుంచి తెప్పించిన గ్రానైట్‌తో ఈ నిర్మాణం చేయించారు. మూలవరులను కదపకుండా స్వామి, అమ్మవార్లకు త్రికాలార్చనలు, నివేదనలు చేయించేవారు. మూలవరుల దర్శనం భక్తులకు లేకపోవడంతో అనివేటి మండపంలో బాలాలయం ఏర్పాటు చేసి సుమారు ఏడాది పాటు భక్తులకు ఉత్సవమూర్తుల దర్శనం కల్పించారు. ఈ సమయంలో మూలవరులకు ఉన్న శక్తిని అంతా కళశాలలో పండితులు ఆవహింపచేసి బాలాలయంలో ఉత్సవ మూర్తుల చెంతన ఉంచడంతో భక్తుల సంఖ్య ఏమాత్రం తగ్గకుండా దినదిన ప్రవర్ధమానం చెందేలా ఆలయం ఖ్యాతినార్జించింది. ఆలయ పునఃనిర్మాణ విషయంలో పలు విమర్శలు వచ్చినా వాటిని లెక్కచేయకుండా ఈవో రామచంద్రమోహన్ మొక్కవోని దీక్షతో ఏడాదిలో ఆలయ నిర్మాణం గ్రానైట్‌తో పూర్తిచేసి విమర్శకుల నోళ్లు మూయించారు. 2012 మార్చి 14న (ఫాల్గుణ బహుళ సప్తమి) రోజున నూతన ఆలయం శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి చేతులమీదుగా జరిపించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఫాల్గుణ బహుళ సప్తమి రోజున పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు చేపడుతున్నారు. అప్పట్లో ఈవో ముందుచూపుతో ఆలయ గోపురం బంగారు తాపడం చేయించాలనే ఉద్దేశ్యంతో ఇటుకతో నిర్మించారు. ఆలయ గోపురం బంగారు తాపడం చేయించాలనే ప్రతిపాదనను తాజాగా రామచంద్రమోహన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే దీనిపై మౌఖిక ఆదేశాలు రాగా ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రకటన ఆలస్యంగా వస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న స్వామివారి వెండి ధ్వజస్తంభం స్థానంలో దాత సహాయంతో బంగారు ధ్వజస్తంభం రూపుదిద్దుకోనుంది. సుమారు రూ.4 కోట్లు వ్యయంతో నెల్లూరుకు చెందిన దాత దీనిని చేయిస్తున్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు ప్రత్యేక పూజలు అనంతరం 22న బంగారు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈవో రామచంద్రమోహన్ మాట్లాడుతూ ఆలయ పునఃనిర్మాణం తన చేతులమీదుగా జరగడం, తిరిగి పుష్కరకాలం పూర్తి వేడుకలు, బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు కూడా తాను ఇక్కడ ఉన్నప్పుడే చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ గోపురం బంగారు తాపడం పనులకు త్వరలోనే గ్రీన్‌సిగ్నల్ వస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం, మార్చి 31: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కొవ్వూరి శివశంకరరెడ్డి-పద్మ దంపతులు రూ.5,00,117 విరాళం సమర్పించారు. దాత కుటుంబీకులకు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు రూ.3,35,840 లభించినట్టు ఈవో తెలిపారు.

'తిరుమల'లో విద్యార్థులు, తల్లిదండ్రులకు సదస్సు



మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్,మార్చి 31: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, వారు మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా ఉండే విధంగా సన్నద్ధం చేయాలన్నారు. జేఈఈ (మెయిన్స్, అడ్వాన్స్), నీట్ పరీక్షల్లో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడ్డారని, వారు మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టాన్ని తల్లిదండ్రులు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ నున్న సరోజిని దేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్ అశుతోష్ ప్రసాద్, డాక్టర్ లత, ఎం.రామకృష్ణ, జీవీ శాస్త్రి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం,మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి-కడియం రైల్వే స్టేషన్ల నడుమ రైలు పట్టాల పక్కన ఉన్న ఒక గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసు హెచ్‌సీ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఏదొక రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెంది ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. ఒంటిపై నీలం, సిమెంటు రంగు టీ షర్టు, నీలం రంగు జీన్సు ప్యాంటు ఉందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెం.9491444022కి సమాచారం అందించాలని కోరారు.

బాలుడి హత్య కేసులో ముగ్గురు మైనర్ల అరెస్టు

ఎటపాక, మార్చి 31: ఓ బాలుడు హత్య కేసులో ముగ్గురు బాలురను అరెస్టు చేసినట్లు సీఐ డి.రామారావు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకర్లకు వివరాలు అందించారు. భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు బాలురు చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. అల్లరిచిల్లరిగా తిరుగుతున్నారు. ఈ నెల 25న వెంకటేశ్వరస్వామి కల్యాణం రోజున ఆలయం సమీపంలో జామాయిల్ తోటలో ఆ ఆరుగురు గంజాయి మత్తులో భోజనం చేస్తుండగా అదే సమయంలో వెంకటరెడ్డిపేటకు చెందిన ఓ బాలుడు ఆ వైపు మలవిసర్జనకు వెళ్లాడు. భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు వాటర్ బాటిల్‌తో వెళ్తున్న ఆ యువకుడిని తిట్టి, కొట్టారు. దీంతో ఆ బాలుడు తన ఇద్దరి స్నేహితులతో అక్కడకు రాగా, రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాంగోపాలపురానికి చెందిన బాలుడు అజ్మీర సాయికుమార్‌ను కత్తులతో పొడిచారు. ఆ బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు చెప్పారు. నిందితుల కోసం గాలించగా, ఆదివారం బొజ్జిగుప్ప గ్రామ శివారులోని రాయిగూడెం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిలో ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితులు గంజాయికి బానిసైనట్లు పోలీసులు తెలిపారు. జేబుల్లో కత్తులు పెట్టుకుని భద్రాచలం సరిహద్దు ప్రాంతాల్లో జనసంచారం లేని చోట ఒంటరిగా ప్రయాణిస్తున్న వారిని ఆపి కత్తులతో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ కె.పార్థసారథి, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

జలపాతంలో పడి యువకుడి మృతి





మోతుగూడెం, మార్చి 31: చింతూరు మండలం పొల్లూరు జలపాతంలో పడి యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ జి.గోపాలరావు తెలిపిన వివరాలు మేరకు తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలంలోని కోటపాడు, సింగంపల్లి గ్రామాలకు చెందిన 25 మంది యువకులు చింతూరు సమీపంలోని పొల్లూరు జలపాతానికి ఆదివారం ట్రావెల్ బస్సులో వచ్చారు. వీరందరూ లిక్కర్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో సింగంపల్లి గ్రామానికి చెందిన వై.కొండయ్య(33)ప్రమాదవశాత్తూ జలపాతంలో జారిపడ్డాడు. అది గమనించిన తోట స్నేహితులు కొండయ్యను జలపాతం నుంచి ఒడ్డుకు చేర్చి మోతుగూడెం ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. కొండయ్య మృతి చెందాడనే వార్త జీర్ణించుకోలేక స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్జిత రథసేవకు స్పందన

అన్నవరం, మార్చి 31: సత్యదేవుడి సన్నిధిలో నూతన ఆర్జితసేవగా ప్రవేశపెట్టిన రథసేవకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి ఆదివారం ఈ రథసేవను నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఆదివారం రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు ఆలయ పీఆర్వో కృష్ణారావు టెంకాయి కొట్టి రథసేవ ప్రారంభించారు. నూతన రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్ద నుంచి పండితుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. రథసేవలో పాల్గొనే భక్తులకు స్వామి వారి కండువా, రవికల వస్త్రం, గోత్రనామాలతో పూజలు, నలుగురికి అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనం తదితర సౌకర్యాలు కల్పించడంతో భక్తులు పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఈసేవకు విశేష ప్రచారం కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది.

బైక్ అదుపుతప్పి ఐస్‌క్రీం వ్యాపారి మృతి



మోతుగూడెం, మార్చి 31: చింతూరు మండలం గొడ్లగూడెం-లక్కవరం జంక్షన్ మధ్యలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో ఐస్‌క్రీం వ్యాపారి మృతి చెందాడు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం గోకవరం మండలం తిరుమలపాలెం గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరావు(45) కుటుంబ పోషణ నిమిత్తం ఐస్‌క్రీంలు విక్రయిస్తుంటాడు. చింతూరు గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శనివారం మోతుగూడెంలో ఐస్‌క్రీంలను విక్రయించిన తర్వాత చింతూరు వెళ్తుండగా గొడ్లగూడెం- లక్కవరం జంక్షన్ మధ్యలో అదుపు తప్పి కింద పడి మృతిచెందాడు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మండపేట మార్చి 31: యువత మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార సమితి కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలు, మదకద్రవ్యాలు వల్ల కలిగే నష్టాన్ని వివరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న జేవీవీ యాత్ర ఆదివారం మండపేట పట్టణానికి చేరుకుంది. ఈసందర్భంగా పట్టణంలో ప్రజలకు మత్తుపదార్థాలు వల్ల కలిగే నష్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జే.వీవీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కట్టా



రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి31: రామచంద్రపురం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కట్టా నాగేశ్వరరావు ఆదివారం టీడీపీలో చేరారు. మండపేటలో జరిగిన శెట్టిబలిజ సాధికారత సమావేశంలోఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ,జనసేన, బీజేపీ రామచంద్రపురం ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. నాగేశ్వరరావుకు కండువావేసి సుభాష్ పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ శెట్టిబలిజ సాధికారత కమిటీ అధ్యక్షుడు సత్తిబాబు పాల్గొన్నారు.

సుభాష్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులను అభ్యర్థించారు.

సుభాష్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు

ద్రాక్షారామ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు సుభాష్‌కు మద్దతు తెలియజేయాలని తీర్మానించారు. అనంతరం రామచంద్రపురంలో టీడీపీ కార్యాలయంలో సుభాష్‌ను కలసి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అమలాపురం పార్లమెంటు కార్యదర్శి జొన్నకూటి భాస్కరరావు, కాజులూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు పలివెల ఇజ్రాయెల్‌రాజు, సిర్ర సురేష్, మోర్త దొరబాబు, మండపల్లి ప్రకాష్, పెందుర్తి కుమార్, సత్యనారాయణ, మధు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు.. గ్రామాల్లో ప్రచారం



అల్లవరం, మార్చి 31: యెంట్రుకోన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోలేటి నానాజీ, వాసర్ల చంద్రరావు, ఈతకోట రాజుతో పాటు 60మందివైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి అమలాపురం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాడికోన, గూడాల గ్రామాల్లో ఆనందరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, నాయకులు మెట్ల రమణబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, ఎన్.సుబ్బరాజు, చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, పంపిరెడ్డి కాశీ, నడింపల్లి సుబ్బరాజు, గోసంగి స్టాలిన్‌బాబు, వేగిరాజు వెంకట్రాజు, చెరుకూరి సాయిరామ్, గెద్దాడ శ్రీను, పోతుల నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధితోనే సంక్షేమం ముడిపడి ఉండాలి

అమలాపురం రూరల్, మార్చి 31: అభివృద్ధితోనే సంక్షేమం ముడిపడి ఉండాలని, అప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. సంక్షేమం పేరుతో జగన్ అభివృద్ధిని అటకెక్కించేశారని ఎద్దేవా చేశారు. ఎ.వేమవరప్పాడులో ఆదివారం ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈతకోట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పలువురు నాయకులు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, ప్రధాన కార్యదర్శి మంద గెద్దయ్య, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు, గుత్తుల భాస్కరరావు, రేవు సతీష్, బండి అశోక్, నక్కా అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుల బృందం ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావును కలుసుకుని సంఘీభావం తెలిపింది. ఎమ్మార్పీఎస్ నాయకులు కాప నాగభూషణం, మంద వెంకటేశ్వరరావు, తొత్తరమూడి ప్రభాకరరావు, ఈతకోట రాజు, కొడమంచిలి సాయికుమార్, నేదునూరి వెంకట్రావు, కొడమంచిలి కృష్ణ, మంద సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

అమలాపురంటౌన్, మార్చి 31: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున క్రైస్తవులు పట్టణంలోని ప్రధాన శ్మశానవాటికల వద్దకు చేరుకుని వారి కుటుంబ సభ్యుల సమాధులను ప్రత్యేకంగా అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు. అమలాపురంలోని బైబిల్ మిషన్ స్వస్థతశాల ఆధ్వర్యంలో రెవరెండు జె.ఎఫ్రాయీము, విక్టోరియారాణి ఆధ్వర్యంలో వందలాది మంది విశ్వాసులు కొవ్వొత్తులతో ప్రదర్శనగా శ్మశానవాటికకు చేరుకుని ప్రార్థనలు చేశారు. ప్రభువైన ఏసుక్రీస్తు సమాధి నుంచి తిరిగి లేచినరోజు క్రైస్తవులకు పెద్ద పండుగ అని అమలాపురం మన్నా జూబ్లీ చర్చి సంఘ కాపరి రెవరెండ్ కార్ల్‌డేవిడ్ కొమానపల్లి పేర్కొన్నారు. ఈస్టర్ సందర్భంగా చర్చిలో రెవరెండ్ ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరు జ్యోతి తాతపూడి, షడ్రక్, ప్రదీప్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధికసంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

అలమూరు: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు తమ బంధువుల సమాధులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి కొవ్వొత్తులు గెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారుజామున ప్రభువును కీర్తిస్తూ గీతాలాపనలు చేశారు. ఆలమూరులో నాతికుమార్‌రాజా ఆధ్వర్యంలో ఏటిగట్టు వద్ద సమాధులకు ప్రత్యేక అలంకరణ చేయించారు. పలు గ్రామాల్లో ఈస్టర్‌ను ఘనంగా జరుపుకున్నారు.

కపిలేశ్వరపురం: గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కపిలేశ్వరపురం, అంగర, వెదురుమూడి, నల్లూరు, తాతపూడి, నే టూరు, కోరుమిల్లి గ్రామ శివార్లలో గల సమాధులను పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల్లోని ఆరాధన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మామిడికుదురు: ఈస్టర్‌వేడుకలను మండలంలో క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసుక్రీస్తును సుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మామిడికుదురులోని స్వస్థత పర్థశాలలో ఫాదర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మగటపల్లిలోని సియోను ప్రార్థనా మందిరంలో పాస్టర్లు ఉండ్రు మోహనరావు, ఉండ్రు మోజేస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో క్రీస్తు గొప్పదనాన్ని వివరించారు. గ్రామాల్లో గల ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు, అన్నసమారాధనలు జరిగాయి.



అమలాపురం: మన్నా జూబ్లీ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు

పి.గన్నవరం: నాగుల్లంక శివారు పెదకందాలపాలెం నూతన యేరూషలేము ప్రార్థనా మందిరంలో ఈస్టర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ అధినేత జి.దానియేలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రారనల్లో వైసీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు పాల్గొన్నారు. ప్రార్థనా మందిరంలో ఆధ్వర్యంలో నిరుపేదలను ఆదుకోవడంపై పాధర్ దానియేలును ఆయన అభినందించారు. అనంతరం వేణుగోపాలరావుకు దానియేలు జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో యు.జాన్‌బాబు, జె.కరుణకుమార్, నల్లి శ్రీచరణ్, ఫిలిఫ్‌గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని పలు చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పాల్గొని క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, కాకి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: మండపేట పట్టణం, మండలంలో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు జరుపుకున్నారు. బంధువుల సమాధులు వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కేశవరంలో సమాధులు వద్ద నివాళులర్పించారు.

అంబాజీపేట: మండలంలోని పలు క్రైస్తవ మందిరాల్లో ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేకువజామునే బంధువుల సమాధులను పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంబాజీపేట హడ్కోకాలనీలోని కల్వరి క్రైస్తవ మందిరంలో బిషప్ జల్లి జార్జ్ పాపాఫ్, విక్టర్‌కుమార్, జాన్‌మోజేస్ ఆధ్వర్యంలో ఈస్టర్ సన్‌రైజ్ ఆరాధన జరిగింది. ఏసుప్రభు పునరుద్థానం వృత్తాంతాన్ని పాపాఫ్ వివరించారు. మండలంలోని పలు చర్చిల్లో నిర్వహించిన ప్రార్థనల్లో పాస్టర్లు చికిలే ధనరాజు, యు.ప్రశాంత్ కుమార్, కరుణాకరరావు, కుసుమ రత్నం పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని 12గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఏసుక్రీస్తుపునరుత్థానాన్ని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు ప్రార్థనలుచేశారు. చర్చిలో పాస్టర్లు బైబిల్ సందేశాలను వివరించారు. శ్మశా నవాటికల్లో సమాధులను అలంకరణచేసి ప్రార్థనలు చేశారు.

అంతర్వేది: ప్రార్థనా మందిరాల వద్ద భక్తి గీతాలు ఆలపించి సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి, కేశవదాసుపాలెం, అంతర్వేది, అంతర్వేదిదేవస్థానం గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఎం.సిరిల్, కె.ఏసయ్యలు, సంఘ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

యానాం: యానాంలో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. స్థానిక రోమన్ కేథలిక్ చర్చిలో ఫాదర్ మారియాదాసు ఈస్టర్ సందేశానిచ్చారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచిన అద్భుతాన్ని కొనియాడుతూ ఏసుక్రీస్తు జీవితం అందరికీ అనుసరణీయమన్నారు. అంబేడ్కర్‌నగర్‌లోని బాపిస్టు చర్చిలో పాస్టర్ ఎల్.ప్రవీణ్‌కుమార్ ఈస్టర్ ప్రాముఖ్యత వివరించారు. చర్చిలో సభ్యుల్లో పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలుగా పదోన్నతలు పొందిన వారిని సత్కరించారు. యానాం నియోజవర్గంలోని పలు చర్చిల్లో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మహిళా అభ్యున్నతికి కృషి: గిడ్డి



పి.గన్నవరం, మార్చి31: రాబోయేది ఉమ్మడి ఎన్‌డీఏ ప్రభుత్వమని, మహిళలుఅన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా కృషిచేస్తానని ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరంలో వీరమహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే నియోజకవర్గ స్థాయిలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలుంటే నేరుగా కలవాలని ప్రతి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల అధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరావు, సర్పంచ్‌లు గుబ్బల దుర్గ, యల్లమిల్లి కృష్ణవేణి, అడ్డగళ్ల సిరిజ్యోతి, ఏసు కుమారి, నల్లా గాయిత్రీ, మహిళలు పాల్గొన్నారు.

గ్రోయిన్స్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు

వరదలకు తీవ్రంగా నష్టపోతున్న రైతులు, ప్రజలను ఆదుకునేందుకు నదీతీర ప్రాంతాల్లో గ్రోయిన్స్ నిర్మాణానికి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో గ్రోయిన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. పి.గన్నవరంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరావు, జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు సాధనాల శ్రీవెంకటేశ్వరరావు(జేడీ), సర్పంచ్‌లు యల్లమిల్లి కృష్ణవేణి, గుబ్బల దుర్గ, అడ్డగళ్ళ శిరి, పెంటా ఏసుకుమారి, తాటికాయల శ్రీనివాసరావు, నల్లా గాయత్రి పాల్గొన్నారు.

ఎన్నికలకు అందరూ సహకరించాలి

అమలాపురం రూరల్, మార్చి 31: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ ఎస్.శ్రీధర్ సూచించారు. ఆయన ఆదేశాలతో కేంద్ర బలగాలతో కలిసి పట్టణ పోలీసులు ఆదివారం సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్న కొంకాపల్లి, బీవీఆర్ కాలనీ, రామాలయం వీధి, ముత్యాలమ్మ గుడి వీధి, ఏవీఆర్ నగర్, ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్లలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ కొంకాపల్లిలో స్థానికులతో సమావేశం నిర్వహించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

మండపేట, మార్చి 31: జెడ్.మేడపాడు వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొట్టుకున్నాయి. రామచంద్రపురం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు 25మంది ప్రయాణికులతో ఆదివారం రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం బయలు దేరింది. జెడ్.మేడపాడు వంతెన వద్ద గోతిని తప్పించే ప్రయత్నంలో లారీ డ్రైవర్ బ్రేక్‌వేయగా వెనుక నుంచి లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు అద్దం దెబ్బతిందని డిపో మేనేజర్ వేంకటేశ్వరరావు తెలిపారు. ప్రయాణికులను వేరే బస్సులో రామచంద్రపురం తరలించారు.

వలంటీర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం

అల్లవరం, మార్చి 31: మండలంలోని 21 సచివాలయాల్లో వలంటీర్లు తమ సెల్‌ఫోన్లను ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్‌కు అందజేశారు. వలంటీర్ల వద్ద నుంచి 261 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎంపీడీవో చెప్పారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి: హరీష్

మలికిపురం, మార్చి 31: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, ప్రధాని మోదీ ఆశయాలను నెరవేర్చాలని అమలాపురం పార్లమెంటరీ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ఆదివారం మోరిలో మాజీ ఎంపీపీ పప్పుల లక్ష్మీనరసవ్వతి రమేష్ ఇంటి వద్ద జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి అభ్యర్థుల విజయానికి జనసైనికులు, బీజేపీ కార్యకర్తలతో కలిసి ముందుకు వెళ్లాలన్నారు. రాజోలు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు ఈప్రాంత సమస్యలపై మంచి అవగాహన ఉందని, ఆయన సహకారంతో ఈనియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నాన్న ఆశయాల కోసం, ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. ముందుగా హరీష్‌కు మాజీ ఎంపీపీ లక్ష్మీసరస్వతి దంపతులు ఘన స్వాగతం పలికారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, కడలి వెంకటరత్నం, కోనసీమ దేవాంగ సంఘం ఉపాధ్యక్షుడు కటకం ధనలక్ష్మీశ్వరరావు, జక్కంపూడి ఆదినారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, పిండి బుజ్జి, ముత్యాల ప్రసాద్, పేరాలబత్తుల సచిన్ పాల్గొన్నారు.





అంతర్వేది: గుడిమూలలో టీడీపీ నాయకులతో సమావేశమైన హరీష్, ఐ.పోలవరం: బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

టీడీపీలో చేరికలు

ఐ.పోలవరం, మార్చి31: కొత్తలంక, కర్రివానిరేవుకు చెందిన వైసీపీ కార్యకర్తలు ఆదివారం టీడీపీలో చేరారు. మురమళ్ల టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు కండువాలువేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.టీడీపీలో చేరినవారిలో గుత్తుల మల్లికార్జునరావు, శీలం వెంకటరమణ, పొత్తూరి సూర్యనారాయణరాజు, బర్రా మసేను, ముదునూరి శ్రీరామరాజు, గుత్తుల భాస్కరరావు, మెండూరి బుజ్జి, అయినవిల్లి రామారావు, పచ్చిమాల రామారావు, రెడ్డి నాగరాజు, సానబోయిన వీరబాబు, శీలం వీరబాబు, చుట్టుగుళ్ళ నాగరాజు, ముషిణి శ్రీను, దంగేటి రమణ, శీలం రమణ, సబ్బతి సునీల్, యార్లగడ్డ వెంకటరమణ, యార్లగడ్డ దుర్గారావు, సవరపు నాగరాజు, సవరపు ప్రసాద్, సవరపు బాబ్జి, సవరపు శ్రీను, అయినవిల్లి సుబ్బారావు, అయినవిల్లి శ్రీను, అయినవిల్లి దుర్గారావు, అయినవిల్లి రాజేష్, వీధి మహేష్, మోర్త రాము, యార్లగడ్డ శ్యామ్యూల్, యార్లగడ్డ సత్తిబాబు, పెన్నాడ వెంకటేశ్వరరావు, సత్తాల సంపదరావు, ఉండ్రాజవరపు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, అర్దాని శ్రీను, నడిమింటి సూర్యప్రభాకరం, చెయ్యేటి శ్రీనుబాబు, అయినవిల్లి వలీయాబాబా, రేకాడి రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

కాట్రేనికోన, మార్చి 31: తిమ్మాపురం సంసానివారి వీధిలో 60మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఆదివారం ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. చేరిన వారిలో సంసాని రామకృష్ణ, ముషిణి సత్తిబాబు, విత్తనాల త్రిమూర్తులు సంసాని కృష్ణమూర్తి, గంజా వెంకటరమణ, విత్తనాల శ్రీనుబాబు, విత్తనాల రామకృష్ణ, మోర్త వెంకటేశులు, రాగుర్తి చిన్నశ్రీనివాసరావు, సానబోయిన ఏడుకొండలు, ఎలిపే చిట్టిబాబు, దంగేటి భైరవస్వామి, జక్కంశెట్టి విష్ణుమూర్తి, గుత్తుల నాగదుర్గారావు, విత్తనాల అర్జున్, బొక్కా సురేష్, కాండ్రేగుల నాగరాజు, సంసాని సూరిబాబు, చింతపల్లి శ్రీమన్నారాయణ, పిల్లా దయాసాగర్‌నారాయణ, సంసాని రామచంద్రరావు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, నడింపల్లి సుబ్బరాజు, వాసంశెట్టి రాజేశ్వరరావు, కోటిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐ.చెరువులో ఎన్నికల శంఖారావం

కాట్రేనికోన, మార్చి 31: పల్లంకుర్రు పంచాయతీ ఐ.చెరువులో ఆదివారం ఎన్నికల శంఖారావంలో భాగంగా టీడీపీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, జనిపల్లి సోమన్న, ఇసుకపట్ల రాంబాబు, ఇసుకపట్ల రమణ, బడుగు పుల్లారావు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా: హరీష్

అంతర్వేది, మార్చి 31: గుడిమూల గ్రామంలో పార్లమెంటరీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ టీడీపీ నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా హరీష్ మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రుద్రరాజు వెంకట్రామరాజు, తిరుమాని ఆచార్యులు, కొల్లు మహాలక్ష్మి, కొల్లు రాము, పోతాబత్తుల రాంబాబు పాల్గొన్నారు.

మానవతా సంస్కార విద్యా పుస్తకం ఆవిష్కరణ

రాయవరం, మార్చి 31: లొల్లవిశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాసచౌదరి రచించిన మానవతా సంస్కార విద్యా పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక మానవతా ఆశ్రమంలో శ్రీనివాసచౌదరి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగల ఫణీశ్వరెడ్డి మాట్లాడుతూ విశ్వమానవతా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ సంస్కార విద్యను విద్యార్థులకు అందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం జరిగిన హోమియో వైద్యశిబిరంలో వైద్యులు సత్యనారాయణ, ప్రకాష్ 120మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పెద్దింట్లమ్మ వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అంతర్వేది, మార్చి 31: శ్రీపెద్దింట్లమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి అనంతరం ఆలయ కొబ్బరి తోటల్లో, చలువ పందిళ్లలో భోజనాలు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు తాగునీరు తదితర సేవలను ఆలయ కమిటీ, పోలీసులు అందించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో నిఘా

యానాం, మార్చి 31: పుదుచ్చేరి లోక్‌సభ పరిధిలోని 30నియోజవర్గాల్లో 232 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పుదుచ్చేరిలో 180, కారైకాల్ 35, మహే 7, యానాంలో 10కేంద్రాలను గుర్తించారు. ఈకేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు అదనపు భద్రత దళాలను మోహరిస్తారు. గత ఎన్నికల్లో 90శాతం మించిన పోలింగ్ జరిగిన బూత్‌లను ఎన్నికల శాఖ ఆధీనంలో ఉంచుకుని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుంది. వీటిలో పుదుచ్చేరిలో మూడు, యానాంలో ఏడు కేంద్రాలు ఉన్నాయి.

పింఛన్ల పంపిణీకి చర్యలు

మలికిపురం, మార్చి 31: పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టామని ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు తెలిపారు. లబ్ధిదారులకు ఈనెల 3నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. 464మంది వలంటీర్లు సెల్‌ఫోన్లు, డివైజ్‌లు మండల కార్యాలయానికి అందజేయాలన్నారు.

టీడీపీకి మద్దతు పలికిన మాదిగలు

అల్లవరం, మార్చి 31: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే తమ మద్దతు అని మాదిగల అత్యవసర సమావేశం పేర్కొంది. దండోరా మండల నాయకుడు ఈతకోట రాజు అధ్యక్షతన అల్లవరంలో ఆదివారం మాదిగల అత్యవసర సమావేశం జరిగింది. వైసీపీలోని కొంత మంది నాయకులు మాదిగలు తమ పార్టీ వైపు ఉన్నారని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండిచారు. కొడమంచిలి సాయికుమార్, చుట్టుగుళ్ల సత్యనారాయణ, యార్లగడ్డ రామకృష్ణ, కొడమంచిలి సురేష్, చుట్టుగుళ్ల ముఖేష్, నవుండ్రు శ్రీను, చెల్లూరి తాతాజీ పాల్గొన్నారు.

టీడీపీ రాజోలు గ్రామశాఖ అధ్యక్షుడిగా అడబాల

రాజోలు, మార్చి31: టీడీపీ రాజోలు గ్రామశాఖ అధ్యక్షుడిగా అడబాల విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజోలు ఉపసర్పంచ్ పామర్తి రమణ స్వగృహం వద్ద జరిగిన గ్రామశాఖ ఉపాధ్యక్షుడు పొన్నమండ కొండరాజు అధ్యక్షతన ఆదివారం గ్రామశాఖ సమావేశం జరిగింది. నూతన అధ్యక్షుడిగా విజయ్‌ను ఎన్నుకున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి తెలిపారు. విజయ్‌ను దుశ్శాలువా కప్పి సన్మానించారు. కడలి వెంకటరమణారావు, మటపర్తి లక్ష్మి, మోకాపార్వతి, నార్కేడుమిల్లి కనకం, రావి మురళీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, గుబ్బల కుమార్, బిక్కిన ప్రసాద్, కాండ్రేగుల రాము, కోళ్ల వెంకన్న, మానేపల్లి బాలాజీవేమా, బోళ్ల రాజేష్, నార్కేడుమిల్లి విష్ణు పాల్గొన్నారు.

నేటి నుంచి బీవీసీలో పాలిసెట్ ఉచిత శిక్షణా తరగతులు

అమలాపురం రూరల్, మార్చి 31: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు బీవీసీ చైర్మన్ బోనం కృష్ణసతీష్ తెలిపారు. ప్రతి విద్యార్థికీ స్టడీ మెటీరియల్ అందజేస్తామని డిప్లొమా ప్రిన్సిపాల్ ఫణిశంకర్ తెలిపారు. పాలిటెక్నిక్‌లో వివిధ బ్రాంచిలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనకు నంది అవార్డు



అమలాపురం టౌన్, మార్చి 31: కాకినాడలో సూర్య నృత్య కళానికేతన్ 15వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఉగాది నంది అవార్డు మహోత్సవం-2024 నిర్వహించారు. అమలాపురం పట్టణానికి చెందిన ఈవని శివాని కూచిపూడి నృత్య ప్రదర్శనలో నంది అవార్డు దక్కించుకుంది. ఆమెను పట్టణ ప్రముఖులు యల్లమిల్లి నాగసుధాకొండలరావు, పురాణపండ లక్ష్మీగణేష్ అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	కలియుగ పట్టణంలో
వెంకటరమణ	ప్రేమలు
శ్రీలలిత	గో ఎట్ లైఫ్
శేఖర్ స్క్రీన్-1	ఓం భీమ్‌బుష్
శేఖర్ స్క్రీన్-2	తలకోన
రమా	డీజేటిల్లు స్క్వేర్
గణపతి	ఊరిపేరు భైరవకోన
వెంకటపద్మావతిస్క్రీన్-1	డీజేటిల్లు స్క్వేర్
వెంకటపద్మావతి స్క్రీన్-2	గాడ్జిల్లా అండ్‌కాంగ్

కాలి నడకన వచ్చి... బాలబాలాజీని దర్శించుకున్న భక్తులు

మామిడికుదురు, మార్చి 31: పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం పడమటిపాలేనికి చెందిన భక్త బృందం ఆదివారం కాలినడకన 30కిలో మీటర్లు నడిచి వచ్చి బాలబాలాజీస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలినడకన వచ్చిన 35మంది భక్తులకు దేవస్థానం వారు ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం



ఆత్రేయపురం, మార్చి 31: విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. మెర్లపాలెం ఏటిగట్టు సమీపంలో విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోవడంతో ఏసమయంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. స్థానికులు సిమెంట్ రాళ్లతో కింద పడిపోకుండా రక్షణ చర్యలు చేపట్టారు. స్తంభం పైభాగం పూర్తిగా దెబ్బతినడంతో వైర్లు తెగిపడే ప్రమాదం పొంచి ఉంది.

వైసీపీ అరాచక పాలనకు బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధం



బండారు సత్యానందరావుతో కలిసి అభివాదం చేస్తున్న జనసేన, బీజేపీ నాయకులు

రావులపాలెం, మార్చి 31: వైసీపీ అరాచక పాలనకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కొత్తపేట అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ పదాధికారి తమలంపూడి రామకృష్ణారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. సత్యానందరావు మాట్లాడుతూ జగన్ పాలనలో మరుగునపడిన అభివృద్ధి తిరిగి పరుగులు పెట్టాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సాధ్యమన్నారు. శ్రీకాళహస్తిలో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకువెళ్ళే డ్రైవర్‌ని తానే అని చెప్పారన్నారు. జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలకు, అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం తథ్యమని, మోదీప్రధాని అవ్వడం ఖాయమన్నారు. నాయకులు బండారు సంజీవ్, చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, తోట స్వామి, కంఠంశెట్టి శ్రీనివాసరావుపాల్గొన్నారు.

పాపాజీ సేవలు ప్రశంసనీయం

ద్రాక్షారామ, మార్చి 31: ఉపాధ్యాయుడిగా కొడమంచిలి పాపాజీ విశిష్ట సేవలు అందించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. పాపాజీ ఉద్యోగవిరమణ సందర్భంగా వెల్ల ప్రాథమిక పాఠశాలలో పాపాజీ దంపతులను ఉపాధ్యాయులు, పీఆర్టీయూ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఏఎంవో చామంతి నాగేశ్వరరావు, పీఆర్టీయూ అధ్యక్షుడు టి.వి.ఎస్.తిలక్‌బాబు, ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి, పీఆర్టీయూ కాకినాడ జిల్లా కార్యదర్శి నీలం వెంకటేశ్వరరావు, పీఆర్టీయూ నాయకులు ఎన్.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ఎం.అమృతరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్.మోహనరావు, ఉపాధ్యాయులు బి.వి.బి.ఎల్.నారాయణ, సత్తి సుబ్బారెడ్డి, విస్సాప్రగడ కృష్ణమూర్తి, గిరజాల సుబ్రహ్మణ్యం, విఠల్‌పాల్గొన్నారు.

వర్గీకరణను కాదన్న వారికి మద్దతు ఇస్తారా!

ఉప్పలగుప్తం, మార్చి 31: ఎస్సీ వర్గీకరణకు ససేమిరా అన్న ముఖ్యమంత్రి జగన్‌కు మాదిగలు మద్దతు ఇస్తారా అని ఎమ్మార్పీఎస్ సమావేశం ప్రశ్నించింది. ఉప్పలగుప్తంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మాదిగ, మాదిగ ఉపకులాలపై కపట ప్రేమ ఒలకబోస్తున్న జగన్ మాదిగల అభివృద్ధికి తన పదవీ కాలంలో తీసుకున్న చర్యలేమిటో వివరించాలని నాయకులు డిమాండ్ చేశారు. జగన్‌కు వత్తాసు పలుకుతున్న మాదిగ సంఘాలు దమ్ముంటే తాను ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని జగన్‌తో ప్రకటన చేయించాలని వ్యాఖ్యానించారు. సమావేశంలో పలివెల రాంబాబు, వంగలపూడి నరసింహమూర్తి, పలివెల పెద్దిరాజు, మోకాటి రామూర్తి, ఉందుర్తి సంజీవ్, వంగలపూడి ప్రవీణ్, సత్తాల నాగరాజు, పలివెల సుధీర్, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోన: కూటమి ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

అట్టహాసంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు, మార్చి 31: అప్పనపల్లి సాకావారిపేటలో ఉన్న వీరభద్రస్వామి ఆలయం వద్ద వీరభద్రస్వామి సంబరాన్ని భక్తులు ఆదివారం అట్టహాసంగా చేశారు. సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ పల్లకీలో స్వామివారిని వైనతేయ నది వరకు ఊరేగించారు. నదీ తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం వద్ద పిల్లి నాగరాజు-మంగా దంపతులు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి నిప్పుల గుండం తొక్కారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి

మామిడికుదురు, మార్చి31: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ప్రత్యేక కృషి చేస్తుందని ఎస్టీయూ మండలశాఖ సమావేశం తీర్మానించింది. మామిడికుదురులోని ఎంపీపీ స్కూలు వద్ద మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు అధ్యక్షతన ఎస్టీయూ సమావేశం ఆదివారం జరిగింది. సంఘ పటిష్టానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మార్చి 8న ఎస్టీయూ ఆధ్వర్యంలో ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎస్టీయూ అభయ్ కన్వీనర్‌గా ఉండ్రు శ్రీరమణను ఎన్నుకున్నారు. కొమ్ముల వీరరాఘవరావు, బత్తుల రమేష్‌బాబు, మట్టా రాజబాబు, వలవల శ్రీబాలాజీ, వడ్లమూడి రాజు, వలవల రాజా, నేల వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

అల్లవరం, మార్చి 31: మండలంలోని గోడిపాలెంలో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. మూడు కుటుంబాల వారు సర్వస్వం కోల్పోయారు. స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. బాధితులను సర్పంచ్ తోట శ్రీదేవి, తోట నరసింహరావు, కాండ్రేగుల వెంకటసత్యనారాయణ పరామర్శించారు.

ఆయుర్వేద వైద్యుడు భవానిపంతులు మృతి

అంబాజీపేట, మార్చి 31: అంబాజీపేటలో 50ఏళ్లుగా ఆయుర్వేద వైద్యం చేస్తున్న ప్రముఖ వైద్యుడు ఆకొండి సూర్యనారాయణ(భవాని పంతులు) ఆదివారం మృతిచెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

కె.గంగవరం, మార్చి31: నవోదయకు వట్రపూడి ఎంపీపీఎస్ పాఠశాల నుంచి మానుపుడి సుదీప్తి, కోటిపల్లి పాఠశాల నుంచి గాలి దుర్గాహర్షవర్ధన్‌లు ఎంపికైనట్లు ఎంఈవో ఏ.నాగరాజు చెప్పారు. వీరిని పలువురు అభినందించారు.

కాట్రేనికోన: చింతలమెరక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సంసాని రామ్‌శ్రీజిత్, కడలి ప్రియాంక నవోదయకు ఎంపికయ్యారు. వీరిద్దరూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఉచిత నవోదయ శిక్షణా సంస్థలో శిక్షణ పొందారు.